

ప్రజాశక్తి
శనివారం 11 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



జెఎన్‌టియు విసిగా వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం- గురజాడ విజయనగరం నూతన వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. అందరి సహాయ సహకారాలతో యూనివర్సిటీని ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



జెఎన్‌టియు విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట సుబ్బయ్య

ఓవైపు పుట్టిపెరిగిన ఊళ్లు... మరోవైపు తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు... జీవితాలతో పెనవేసుకుపోయిన చెట్టు, పుట్ట... ఇలా సర్వం వదిలి వెళ్లడమంటే ఆషామాషీ కాదు. తాజాగా ఉద్యోగాలు, ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తున్న వారి సంగతి కాస్త పక్కన పెడితే, కేవలం ఊరిని మాత్రమే నమ్ముకున్నవారు ఒకేసారి తెగదెంపులు చేసుకోవడం చిన్నవిషయం కాదు. అటువంటివారు శాశ్వతంగా ఊరు వదిలిపోవాలంటే గుండెలు బరువెక్కుతాయి. మనసు విలవిల్లాడుతుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితే ఎదురైంది భోగాపురం మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలకు. భూముల కోసం అప్పుడు బుజ్జగించారు... ఇప్పుడు పొమ్మంటున్నారు. ఆగమేఘాలపై గ్రామాలు ఖాళీచేయాలంటూ అధికారులు ఆదేశాలు జారీచేయడంతో కన్నీటి పర్యంతమౌతున్నారు. వారి ఆవేదన, ఆక్రోశం ఆపడం ఎవరి తరమూ కావడం లేదు.

నిర్వాసితుల ఇళ్లను కూల్చివేస్తున్న జెసిబి



ఊళ్లు వదులుకోలేక.. ఇళ్లు కట్టుకోలేక

- అవస్థలు పడుతున్న ఎయిర్‌పోర్టు నిర్వాసితులు
- ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్న అధికారులు
- సౌకర్యాలు కల్పించకుండా వెళ్లిపోమంటే ఎలా అంటున్న బాధితులు
- వలసకూలీల పరిస్థితి వర్ణనాతీతం
- యువతకు అందని ప్యాకేజీలు



మరడపాలెం గ్రామం ఖాళీ చేయడంతో ఇల్లు గల్లంతై స్థలం ఇవ్వక అభాగ్యురాలైన తెచ్చి లక్ష్మి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పేరిట సుమారు 2700 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయాల్సి వస్తోంది. చట్టప్రకారం భూములు, నష్టపరిహారంతోపాటు గ్రామస్తులందరికీ పునరావాసం కల్పించాలి. పునరావాస కాలనీల్లో అన్ని సదుపాయాలూ కల్పించాలి. 18 ఏళ్లు నిండిన వారికి ఆర్అర్ ప్యాకేజీలు ఇవ్వాలి. ఇవేవీ పూర్తిచేయకుండానే అధికారులు గ్రామాలు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల ఆ గ్రామాలకు వెళ్లిన జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ రెండు రోజుల్లో ఖాళీచేయాలని, లేదంటే తామే ఇళ్లను కూల్చివేయాల్సి వస్తుందని ఆదేశించడంతో ఆయా గ్రామాల ప్రజానీకం బిక్కుబిక్కుమంటున్నారు. ప్రజావసరాల కోసం భూములు, ఊళ్లు త్యాగం చేస్తే మాకిచ్చిన గౌరవం ఇదేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు బందోబస్తుపెట్టిమరీ ఊళ్లు ఖాళీ చేయిస్తున్న నేపథ్యంలో నిర్వాసిత గ్రామాలు, గూడెపు వలస, లింగాలవలస నిర్వాసిత కాలనీల్లో 'ప్రజాశక్తి' పర్యటించింది.

మరడపాలెంలో సుమారు 270 కుటుంబాలు ఉన్నాయని గ్రామస్తులతోపాటు స్థానిక సర్పంచ్ కొండపు కొత్తయ్యరెడ్డి చెప్పారు. అధికారులు గుర్తించినవి 240 కుటుంబాలు మాత్రమే. వీరికి లింగాలవలస సమీపంలోని నిర్వాసిత కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. మిగిలిన 30 మంది వలసకూలీలు కావడంతో వీరిని గుర్తించలేదు. కానీ, వీరికి గ్రామ కంఠంలోనే ఇళ్లు ఉన్నాయి. ఆయా ఇళ్లల్లో వృద్ధులు, పిల్లలు ఉంటున్నారు. ప్రస్తుతం గ్రామాలు ఖాళీచేయాల్సిన పరిస్థితి రావడంతో వారంతా ఎలా బతకాలో తెలియని పరిస్థితి. మిగిలిన వారి మాదిరిగానే తమకు కూడా 5 సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తే తలదాచుకుంటామని అధికారుల ఎదుట ప్రాధేయపడుతున్నా సెంటున్నరకు మించి ఇవ్వబోమంటూ అధికార యంత్రాంగం చెబుతోంది. ఇక ఇళ్ల స్థలాలు పొందిన 240 మందిలో 117 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించగలిగారు. వీరిలో 17మంది మాత్రమే పూర్తిచేశారు. మిగిలినవన్నీ వివిధ స్థాయిలో ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. ఇళ్ల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం ఇస్తామన్న రూ.9.50 లక్షలు ఏడాది క్రితం ఇచ్చారు. దీంతో నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణ వ్యయాలు పెరిగిపోయాయని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా నిర్మాణాలు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. తాగునీరు, విద్యుత్తు వంటి సదుపాయాలు కల్పించలేదని, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా అసంపూర్తిగా ఉన్నాయని, ఈ సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వానికే సమయం సరిపోకపోతే సొంతంగా ఇళ్ల నిర్మించుకోవానికి సమయం ఎలా సరిపోతుందని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. మరోవైపు చాలా నెలల క్రితమే విద్యుత్ లైన్లు అందుబాటులోకి వచ్చాయని, మీటర్లకు దరఖాస్తు చేసుకుని సమకూర్చుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అధికారులు, వారి తరపున అధికార పార్టీ నాయులు చెబుతున్నారు. ఇలా ఇళ్ల నిర్మాణాలు అంపూర్తిగా ఉండడం, పునరావాస కాలనీలో సదుపాయాలు అంతంత మాత్రం కావడం వల్ల సమయం కోరుతున్నారు. తమకు స్థలాలే ఇవ్వకపోతే ఎక్కడ తలదాచుకోవాలంటూ వలసకార్మికులు ప్రశ్నిస్తున్నారు. తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని రెల్లిపేట గ్రామస్తులు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీలు ఇవ్వలేదంటూ ఈ రెండు గ్రామాల్లోని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేశారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న కర్రోతు బంగారాజు

మరడపాలెంలో ఉద్రిక్తత

భోగాపురం : మండలంలోని కొలువాడ పంచాయతీలోని ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామం మరడపాలెంలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. అధికారులు ఇళ్లు కూల్చేందుకు సిద్ధం కాగా, స్థానికులు అడ్డుకున్నారు. పునరావాసం కల్పించిన చోట కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఎలా ఖాళీ చేసి వెళ్లేదని గ్రామస్తులు ప్రశ్నించారు. రెండు నెలల సమయం ఇవ్వాలని, తామంతా స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్ళిపోతామని చెప్పారు. దీనికి అధికారులు అంగీకరించలేదు. ఈలోగా అక్కడికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, జనసేన నియోజకవర్గ నాయకులు లోకం మాధవి, టిడిపి నాయకులు కె.సత్యనారాయణ అక్కడికి చేరుకుని, నిర్వాసితులకు మద్దతుగా నిలిశారు. తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, సిఐ విజయనాథ్‌తో వారు మాట్లాడారు. అర్ధాంతరంగా ఖాళీ చేయాలంటే ఎలా? అని ప్రశ్నించారు. సుమారు మూడు గంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయాన్ని వివరిస్తామని చెప్పి బాధితులను కూడా టిడిపి, జనసేన నాయకులు తీసుకువెళ్లారు.

అవసరం తీరిపోయాక బెదిరిస్తున్నారు



ప్రభుత్వం అవసరాలు తీరిపోయాయి కదా! మా అవసరాలు వారికి పట్టడం లేదు. అప్పుడు బుజ్జగించారు. ఇప్పుడు బెదిరిస్తున్నారు. డబ్బుంటే మాత్రం నిర్మాణాలు జరిగిపోతాయా? రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్తు వంటి సదుపాయాల కల్పనకే ప్రభుత్వానికి మూడేళ్లు పట్టింది. ఆస్తులు, అంతస్తులు కోల్పోయి, అక్కడికి వెళ్లి సమస్యలు ఎదుర్కోడానికి మేము సిద్ధంగా లేము. పోయిన ఆస్తులు ఇవ్వమని అడగడం లేదు. కనీసం సదుపాయాలైనా కల్పించాలి కదా? సౌకర్యాలు కల్పిస్తే మా పాట్లేవో మేం పడతాం. అంతేగానీ, బెదిరింపులతో ఇళ్లు ఖాళీ చేయిస్తారా?

- కొండపు రవణమ్మ, మరడపాలెం

నిర్వాసితులకు గడువు పెంచాలి



పోలీసులతో భయపెట్టి నిర్వాసితుల ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం సరికాదు. వారంతా ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలకు గౌరవించి ఊళ్లు, భూములు త్యాగం చేశారు. వారిని ఆ విధంగా గుర్తించాలి. పునరావాసానికి ఇవ్వాల్సిన మొత్తం ప్రభుత్వం సకాలంలో ఇవ్వలేదు. ఈలోపు నిర్మాణ వ్యయం పెరిగి సకాలంలో నిర్మించుకోకపోయామని చెబుతున్నారు. దీన్ని అర్థం చేసుకోకుండా ముందుకు సాగడం సరికాదు. కనీసం ఏప్రిల్ వరకు గడువు పెంచితే విద్యాసంవత్సరం కూడా ముగుస్తుంది. వలస కూలీలకు, 18 ఏళ్లు నిండిన యువకులకు న్యాయం చేయాలి.

- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి



సిపిఎం నాయకులు, స్థానికులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

దళితుల ఇళ్లు కూల్చివేత

అడ్డుకున్న సిపిఎం నాయకులు ● ఏడుగురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బొగ్గులదిబ్బలో దళితుల ఇళ్లను శుక్రవారం ప్రభుత్వం అక్రమంగా తొలగించింది. ఈ అక్రమ తొలగింపులను సిపిఎం ఆధ్వర్యాన అడ్డుకున్నారు. దీంతో సిపిఎం నాయకులతోపాటు స్థానికులను మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్టుచేశారు.

నగరంలో బొగ్గులదిబ్బలో నిరుపేద దళితులు 50 ఏళ్లుగా నివాసముంటున్నారు. ఆ ఇళ్లను అక్రమంగా తొలగించేందుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం సిద్ధమయ్యారు. జెసిబితో ఇళ్ల తొలగింపులు చేపట్టారు. దీన్ని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, నాయకులు బి.రమణ ఆధ్వర్యాన స్థానికులు అడ్డుకున్నారు. జిఒ నంబర్ 225 ప్రకారం నివాసమున్న చోటే పట్టాలు ఇవ్వాలని రెడ్డి శంకరరావు అధికారులను డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు ఆపి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈలోగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టు చేశారు. రెడ్డి శంకరరావు, బి.రమణతో పాటు టిడిపి మాజీ కౌన్సిలర్ ముద్దాడ చంద్రశేఖర్, నలుగురు స్థానికులను అరెస్టు చేసి, వన్‌టౌన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు. రెండు ఇళ్లను జెసిబితో తొలగించారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ పేద దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని స్పష్టంచేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఖండన

దళితుల ఇళ్ల అక్రమ తొలగింపులను అడ్డుకున్న సిపిఎం నాయకులను, స్థానికులను అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు దశాబ్దాలుగా దళితులు నివశిస్తున్న స్థలాల్లో వారికి పట్టాలు మంజూరు చేయకుండా, ఇళ్లను కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను అణచివేయాలని చూడటం దారుణమని పేర్కొన్నారు. దళితులకు న్యాయం జరిగే వరకూ అండగా నిలుస్తామని స్పష్టంచేశారు.

ఫైలేరియాను నిర్మూలిద్దాం

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఫైలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ డిఇసి మాత్రలను వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. స్థానిక కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డిఇసి, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులతో మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఇసి, ఆల్బెండజోల్ మాత్రలను అందరూ ఒకేసారి వాడినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలో 23,96,000 మందికి వాలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, జిల్లా మలేరియా అధికారి తులసి, సహాయ మలేరియా అధికారి వెంకటరమణ, పాఠశాల హెచ్‌ఎం ఆర్.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



డిఇసి మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ఆ వార్డెన్‌ను తొలగించాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల అస్వస్థతకు కారణమైన కొత్తవలస బిసి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారికి శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ఈ నెల 7న కొత్తవలస బిసి బాలికల హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు వెళ్తుండగా మార్గం మధ్యలో 24 మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. హాస్టల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, ముందురోజు వండిన అన్నం కలిపి పెట్టడమే కారణమన్నారు. మరోవైపు హాస్టల్లో కనీస సదుపాయాలు లేవని, జ్వరం, ఇతర ఏ సమస్యలు వచ్చినా వార్డెన్ పట్టించుకునే పరిస్థితి లేదని తెలిపారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా బయటకు చెప్పకుండా నిర్బంధం విధించే పరిస్థితి నెలకొందన్నారు. ఇలా విద్యార్థులు సమస్యలతో ఇబ్బంది పడితే, ఎలా చదువుకుని ఉత్తీర్ణులవుతారని ప్రశ్నించారు. అనారోగ్యానికి గురైన వారికి మెరుగైన ఆరోగ్యం అందించాలని, అందుకు కారణమైన హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. ఇటువంటి సంఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎం.వెంకటేష్, నాయకులు సోమేశ్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

145 జంటలకు రూ.98.45 లక్షలు

కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధులు జమ

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా పథకం ఆర్థిక సాయాన్ని శుక్రవారం సిఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆయన బటన్ నొక్కి మొదటి విడతగా జిల్లాలో 145 జంటల ఖాతాల్లో రూ. 98.45 లక్షలను జమ చేశారు. గతేడాది అక్టోబరు ఒకటో నుంచి డిసెంబరు 31 మధ్య వివాహాలు చేసుకుని అర్హత ఉన్నవారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఈ పథకం కింద వివాహం చేసుకుంటే రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.లక్షా 20 వేలు, వికలాంగులకు రూ.1.50 లక్షలు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తోంది. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి రత్నం, జిల్లా పంచాయతీ అధికారి నిర్మలా దేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 72 పోలింగ్ కేంద్రాలు

ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం మార్చి 13న ఎన్నిక జరుగుతుందని, దీనికోసం జిల్లాలో అదనంగా 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. జిల్లాలో ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తన ఛాంబర్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కొన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య 1400 కంటే ఎక్కువగా ఉండటం వల్ల అదనంగా 8 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఎన్నికల్లో 64 కేంద్రాలు ఉండగా, ఈ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల సంఖ్య 72కు చేరిందని తెలిపారు. రాజాంలో 1, బొబ్బిలిలో 2, విజయనగరంలో 2, శృంగవరపుకోటలో 2, లక్కవరపుకోటలో 1 చొప్పున పోలింగ్ కేంద్రాలు పెరుగుతున్నాయని చెప్పారు. బొబ్బిలి, విజయనగరం, శృంగవరపుకోటల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో చిన్నపాటి మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.

నామినేషన్లు, స్క్రూట్నీ, ఉపసంహరణ, లెక్కింపు తదితర ప్రక్రియలన్నీ విశాఖపట్నంలోనే జరుగుతాయని చెప్పారు. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు దొర్లకుండా, డూప్లికేషన్ లేకుండా కచ్చితమైన జాబితాను తయారు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. సమావేశంలో వైకాపా, టిడిపి, సిపిఐ, సిపిఎం ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రెస్‌క్లబ్ నిర్వహణకు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం ప్రెస్‌క్లబ్ కార్యకలాపాల నిర్వహణకు తాత్కాలిక నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ శుక్రవారం జరిగింది. నగర పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, చిన్నమధ్య తరహా పత్రికల విలేకరులు, వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, లోకల్ కేబుల్ టీవీ ఛానెళ్ల కేటగిరీల నుంచి 21 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నెహ్రూ యువ కేంద్ర భవనంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సభ్యులంతా సుదీర్ఘంగా చర్చించారు. ఆరు నెలలపాటు తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటైన నూతన కార్యవర్గం అందరినీ కలుపుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని మూకుమ్మడి ప్రకటన చేశారు. సమావేశంలో ఎపిఆర్‌ఒ డి.నారాయణరావు, ఎవిఎస్ సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గంలో సభ్యులుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, మధ్య, చిన్న తరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి ప్రతినిధులను ప్రెస్‌క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిలో పిఎస్ శివప్రసాద్, బూరాడ శ్రీనివాస్, ఎం.ఎం.ఎల్.నాయుడు, వి.వెంకట జగన్నాథం, కె.శేఖర్, కె.రమేశ్‌నాయుడు, బిజిఆర్ పాత్రో, వి.ఎం.పాత్రో, బి.శ్రీనివాస్, ఎ.సూరిబాబు, కె.శ్రీనివాసులు, పంచాది అప్పారావు, అవనాపు సత్యనారాయణ, విఎంకె లక్ష్మణరావు, ఎం.ఎస్.ఎన్.రాజు, జయరాజు, రవి చంద్రశేఖర్, గొర్లె సూరిబాబు, కరీం, ఈశ్వర్, డి.సత్యనారాయణ ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయనగరం

కొత్త రంగాల్లో నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు మెరుగు పడతాయని ఖరగ్‌పూర్ ఐఐటి ప్రొఫెసర్ శంతనూ చటోపాధ్యాయ అన్నారు. సీతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన చర్చా సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు కొత్త రంగాల్లో నైపుణ్యాలను ఆకలింపు చేసుకోవాలన్నారు. ఖరగ్‌పూర్ ఐఐటి నుంచి రిషి శిరోహి (అసిస్టెంట్ రిజిస్టర్ అకాడమిక్), సురోజ్ దేబ్ నాథ్ (అసిస్టెంట్ ఇంజనీర్ వాటర్ వర్క్స్) ప్రొఫెసర్ చటోపాధ్యాయతోపాటు ఈ చర్చలో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థుల కోసం మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సీతమ్ సిబ్బందిని అభినందిస్తూ సత్యా సంస్థల అధినేత బొత్స సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి తమ సందేశాలను పంపించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యక్షులు డాక్టర్ వేణుమాధవ్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చటోపాధ్యాయ

విద్యా ప్రమాణాలు మెరుగు పరచకపోతే చర్యలు

డిఇఒ లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-వంగర

విద్యా ప్రమాణాలు మెరుగుపరచకపోతే చర్యలు తప్పవని డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి ఉపాధ్యాయులను హెచ్చరించారు. వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో పనిచేస్తున్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్(ఎల్ఐపి)ను అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులకు చదవడంతోపాటు రాయడం నేర్పించాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబులపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు చక్కనైన తర్ఫీదు అందించి మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం కెజిబివిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు, ఎంఇఒ వై.దుర్గారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వర్ రెడ్డి

అలరించిన వీణకచేరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం సోమయాజులు కాశీపతిరావు స్మారక భవనంలో నిర్వహించిన వీణకచేరీ ఆద్యంతం అలరించింది. బెంగళూరుకు చెందిన కళాకారిణి కాశీవిశాలాక్షి చేసిన వీణ కచేరీకి ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు మండపాక రవి మృదంగంపై సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దేవుని సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం వసూలు చేయాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వంద శాతం యూజర్ ఛార్జీల వసూళ్లే లక్ష్యంగా అధికారులు మరింత కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్ కుమార్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లాప్ అమల్లో భాగంగా యూజర్ ఛార్జీల వసూలు విషయమై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యూజర్ ఛార్జీలు వంద శాతం వసూలైన పరిస్థితుల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం నగరంలో జరుగుతున్న రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి పారదర్శకంగా రీ సర్వే విషయాలను వివరించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ శ్రీరాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఇఇ శ్రీనివాసరావు, సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

ఫిష్‌ఆంధ్రా యూనిట్లు ప్రారంభించాలి

విజయనగరం : జిల్లాలో ఫిష్ ఆంధ్రా యూనిట్లను త్వరితగతిన ప్రారంభించాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మత్స్యశాఖ ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ల వారీగా సంబంధిత మత్స్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 112 మినీ ఫిష్ వెండింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా, లబ్ధిదారులను గుర్తించి, లబ్దిదారు వాటా చెల్లించినట్లు అధికారులు వివరించారు. వారిలో 58 మంది యూనిట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సొంత స్థలాల్లో యూనిట్లను స్థాపించడానికి ముందుకువచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.



బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

బాధిత కుటుంబాలకు నగదు సహాయం

పూసపాటిరేగ : మండలంలోని కనిమెట్టలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎంఎల్‌సి పి. సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు గృహాలను మంజూరు చేస్తామన్నారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 వేలు నగదు అందజేశారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు శాంతాటి శ్రీను, పళ్ళ సత్యం, తౌడు తదితరులు పాల్గొన్నారు.

సాదా బైనామాకు దరఖాస్తుల స్వీకరణ

వేపాడ : సాదాబైనామాకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తహశీల్దార్ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సాదాబై నామా కొరకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామాలలో గ్రామ పురోనీలు, క్రై చీటీలు, స్టాంపు దస్తా వేజులపై గ్రామ పెద్దల సమక్షంలో రాసుకున్న పురోణీలు ఉన్నవారు జీవో ఎంఎస్ నెంబరు 661 ప్రకారం గ్రామ సచివాలయాలలో ఆధార్ నంబర్‌తో రైతులు నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకున్న రైతులకు వారి అనుభవంలో ఉన్న భూములను వారి పేరును రికార్డులలో నమోదు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాలలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

వేపాడ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ కె. అప్పారావు ఆధ్వర్యంలో వార్సికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు కూడా నేర్చుకోవాలన్నారు. దీని వల్ల మానసిక వికాసం పెంపొంది చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ జాతర ప్రారంభం

వేపాడ : మండలంలోని చిన్న గుడిపాల గ్రామంలో పరదేశమ్మ జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా శనివారము గుర్రపు పరుగు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.



ఆదిత్య పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ విద్యార్థులు

పాఠశాలల పర్యవేక్షణ

నెల్లిమర్ల : నెల్లిమర్ల డైట్ విద్యార్థులు పాఠశాల పర్యవేక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం డైట్ ప్రిన్సిపాల్ ఎన్ తిరుపతి నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించిన 14 స్కూల్లో ఉన్న ప్రీ ప్రైమరీ విద్యార్థులను పర్యవేక్షించారు. స్థానిక ఆదిత్యా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, ప్రవర్తనను పర్యవేక్షించారు. ఆదిత్య విద్యాలయంలో డైట్ విద్యార్థులు పాఠశాల యొక్క ప్రార్థన, టైం టేబుల్ ఏ రికార్డులను నిర్వహిస్తున్నారో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఇఒ వరప్రసాదరావు

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి : విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని ఎంఇఒ ఎం. వరప్రసాదరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్. ఆముదాలవలస కాలనీ, లక్ష్మంపురం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మకత విద్యను అందించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే మెలకువలతో కూడిన విద్యా అందించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అందించాలన్నారు. ఈయనతోపాటు హెచ్‌ఎంలు మురపాక వెంకటరమణ, విజయమ్మ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సిఆర్‌పి కెంబూరు వెంకటరమణ ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని డొంకినవలస రైల్వే స్టేషన్ దగ్గరలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 2వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి వైసిపి మండల నాయకులు ఆవు సత్యనారాయణ, సత్యవతి దంపతులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రవి, సత్యనారాయణ రాజు, వైసిపి నాయకులు తెంటు తిరుపతి నాయడు, గండి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు



అన్నదానంలో పాల్గొన్న నిర్వాహకులు

ఉగాదికి ప్రారంభమయ్యేనా.?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో జగనన్న గృహాలను ఉగాది నాటికి ప్రారంభించాలని కసరత్తు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే చాలా చోట్ల స్లాబ్ లెవెల్లోనే ఇళ్లు ఉన్నాయి. ముఖ్యగా బొద్దాంలో 75శాతం ఇళ్ల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అక్కడ మౌలిక వసతులు లేవు. వల్లంపూడి గ్రామంలో ఇంకా నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక్కడ మెటీరియల్ తరలించడానికి కూడా రహదారి సౌకర్యం లేకపోవడంతో నిర్మానాలు నత్తనకడన సాగుతున్నాయి. బక్కునాయుడుపేట 40 ఇళ్లు మంజూరు కాగా సగం మాత్రమే లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. మిగతా వారు నీటి సౌకర్యం లేకపోవడంతో నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. బల్లంకి గ్రామంలో కూడా నీటి కొరత వేధిస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇప్పటికే పలు సమావేశాల్లో ఈ విషయాలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాన జగనన్న కాలనీల్లో మార్పులు రావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ విషయంపై మండల గృహ నిర్మాణ సంస్థ ఎఇను వివరణ కోరగా లబ్ధిదారులు చెప్పిన సమస్యలు వాస్తవమేనని నీటి సౌకర్యం కొరకు సంబంధిత అధికారులకు తెలియజేశామని చెప్పారు.

ధరలు పెరగుదలా ఒక కారణమే..

ప్రభుత్వం స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఆదేశించినా నిర్మాణ సామగ్రి ధరలు పెరగిపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేకపోతున్నారు. ప్రభుతత్వం ఇస్తున్న రూ.1.80లక్షలు ఎటూ సరిపోదని దాన్ని రూ.5లక్షలు వరకూ పెంచాలని కోరుతున్నారు.

జగనన్న కాలనీలపై మల్లగుల్లాలు
ముందుకు కదలని పనులు



బల్లంకిలో నత్తనడక సాగుతున్న గృహ నిర్మాణ పనులు



బాధ్యతలు స్వీకరించిన రేవతి

ఆర్‌ఐగా రేవతి బాధ్యతలు

రేగిడి : మండల ఆర్‌ఐగా రేవతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వంగర మండ లంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతపై రేగిడి ఆర్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఆర్‌ఐ ఉమా పట్నాయక్ గంగువారి సిగడాం మండలం ఆర్‌ఐగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

రెండు గ్రామాల్లో హౌసింగ్ డే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ముకుందపురం, ఓబులయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన హౌసింగ్ డే గ్రామ సభలో సమస్యలు వెల్లువెత్తాయి. హౌసింగ్ డిఇ శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉగాది నాటికి జగనన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఇప్పటికీ ఇంటి నిర్మాణాన్ని ప్రారంబించన వారి వద్ద నుంచి స్థలాన్ని వెనుక్కు తీసుకుని వేరే వారికి ఇచ్చేస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఈ. పైడిరాజు మాట్లాడుతూ పూర్తయిన నిర్మాణ లబ్ధిదారులు జాబితాను తమకు అందజేస్తే తమ పరిధిలో గల పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముకుందపురం, ఓబలేయ్యపాలెం గ్రామ సర్పంచులు, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, హౌసింగ్ ఎఇ సత్యనారాయణ, మండల పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి ఎండి ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి. దేవి, విద్యుత్ శాఖ ఎఇ, ఉపాధి హామీ, వైయస్సార్ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వాలంటీర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఇ. పైడిరాజు

కొత్తవలస: మండలంలో జగనన్న కాలనీలను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ వై. పద్మజ అన్నారు. వీరభద్రపురంలో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తేను బిల్లులు వస్తాయన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇల్లు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కాలనీలో విద్యుత్, మంచినీటి ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

‘ఉత్తరాంధ్ర ఇంకా వెనుకబడే ఉంది’

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మన రాష్ట్రంలో ఉత్తరాంధ్ర ఇంకా వెనుకబడే ఉందని అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రాంతం అభివృద్ధికి ఆ ప్రాంతానికి చెందిన యువత తాము అభ్యసించే విద్య ద్వారా సముపార్జించిన విజ్ఞానాన్ని నైపణ్యవంతంగా సమాజంలో సామాన్యుని వద్దకు చేర్చే ప్రయత్నం చేయాలని అన్నారు. మన రాష్ట్రంలో ఉత్తరాంధ్ర ఇంకా వెనుకబడే ఉందని ఈ ప్రాంత వాసులుగా అభివృద్ధి ప్రక్రియలో చురుకుగా కృషి చేయాలని పిలుపిచ్చారు. కాలేజీలో చదువుతున్న వివిధ విద్యార్థులకు తమ సబ్జెక్టుల వారీగా సమాజంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలా పాల్గొనవచ్చునో సోదాహరణంగా వివరించారు. నూతన విద్యా విధానం విధానం సామాజిక అంశాలను అకడమిక్ ప్రాజెక్టులుగా ఇచ్చి వాటికి మార్కులు కేటాయించే పద్ధతి ప్రవేశ పెట్టిందని అన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, లెక్చరర్లు ఈరన్న, రవీంద్రనాథ్, వాసుదేవ రావు, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, సంధ్యారాణి, ఎన్.సి.సి. ఆఫీసర్ భాస్కరరావు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతతున్న మాజీ విసి లజపతిరాయ్

పేద విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

టిడిపి నియోజకవర్గ నాయకుడు గొంప కృష్ణ తన సొంత నిధులతో 70 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున యూనిఫారాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కే ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ వెనుకబడిన వర్గాలకు సంబంధించినటువంటి నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి సంస్థ అని ఆ సంస్థ గుర్తించిన సుమారు 70 మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున యూనిఫాం అందించామని చెప్పారు. భవిష్యత్తులో చదువు ఒక్కటే ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దగలదని అందరూ చదువులపై దృష్టి పెట్టి లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. వివిధ రకాల నైపుణ్యాలు సాఫ్ట్ స్కిల్స్ అండ్ ఐటీ స్కిల్స్, క్రీడల్లో కూడా రాణించి మీ స్థాయిని పెంపొందించు కోవాలన్నారు. భవిష్యత్తులో నైపుణ్యత గల విద్యార్థులకు విశాఖలో ఉద్యోగ వకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముక్కా రామకృష్ణ, ఎస్‌కోట టిడిపి సెక్రెటరీ జుత్తాడ రామసత్యం, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లంక శ్రీను, లాలం అర్జున, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫారాలు అందించిన గొంప కృష్ణ

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

వేపాడ : మండలంలోని ముకుందపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నలు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవికుమార్ నంబూరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని ప్రయోజకుల కావాలని కోరారు. తాము చదువుకునే రోజుల్లో తక్కువ అవకాశాలు ఉండేవని ఇప్పుడు విద్యార్థులకు ఎటువంటి కష్టాలు లేకుండా ఎక్కువ అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొట్టాడ సురేష్, ఉపాధ్యాయులు దేవి, జొన్నపిల్లి హరిబాబు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి హరీష్, అప్పలరాము, ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులుత

పాదయాత్ర అడ్డుకునేందుకు కుట్ర

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు వైసిపి కుట్ర పన్నుతుందని టిడిపి వాణిజ్య విభాగం పార్లమెంట్ అధ్యక్షులు సుంకరి సాయిరమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. కోటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రను అడ్డుకునేందుకు వైసిపి, పోలీసులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కుట్రలో భాగంగానే టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు దూండి రాకేష్ పై నెల్లూరు సిఐ చెయ్యి చేసుకున్నారన్నారు. రాకేష్‌పై చెయ్యి చేసుకున్న సిఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతలు, కార్యకర్తలపై చెయ్యి చేసుకున్న, దాడి చేసిన ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బంగారురాజు, ఎన్. హరి, సిహెచ్ నారాయణరావు తదితరులు ఉన్నారు.

వంతెన మంజూరైతే శిలాఫలకమేది?

ప్రజాశక్తి- బాడంగి

వంతెన మంజూరైతే శిలాఫలకమేదని మండల వైసిపి నాయకులు బి. శంకర్ రావు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి బోగి గౌరి, నాయకులు తెంటు మధు, జెసియస్ కన్వీనర్ మరిపి శంకర్ బొబ్బిలి టిడిపి నాయకులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల పర్యటనకు వచ్చిన టిడిపి నాయకులు బేబినాయన, లక్ష్మనాయుడు వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా జయప్రకాశ్, 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా రాజులు ఉన్నప్పుడు గుర్తు రాని వంతెన ఇప్పుడు ఎందుకు గుర్తు రాలేదన్నారు. ఇప్పుడు ఓట్లు కోసం గొల్లాది వచి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గొల్లాది వంతెన కోసం ఎమ్మెల్యే శంబంగి సిఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఎన్నికలకు ముందే కచ్చితంగా వంతెన నిర్మించి తీరుతామని చెప్పారు. బొబ్బిలి రాజులు వైఎస్ కుటుంబం దయాదాక్షిణ్యాలతోనే మూడు సార్లు గెలిచారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.



సమావేంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కొలతల ప్రకారం పని చేస్తే కూలి గిట్టుబాటు

ప్రజాశక్తి- రేగిడి

కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మునకల వలస చెరువు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా మస్టర్స్‌ను తనిఖీ చేశారు. కూలి గిట్టుబాటుపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతలు ప్రకారం పనిచేసినట్లు అయితే 257 రూపాయలు వస్తుందని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల మస్టర్, ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని తెలిపారు. పనులు వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఎపిఒతో పాటు టెక్నికల్ అసిస్టెంట్, వేతనదారులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

సచివాల తయం ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపిడిఒ జి. కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఈ మేరకు మునకలవలస గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికా ర్డులు పరిశీలించారు. ముందుగా శాఖల వారీగా పనితీరు మెరుగుపరుచుకోవాల న్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కోసం అర్జీలు సేకరించాలన్నారు. ఏ వారం వచ్చిన అర్జీలను ఆ వారమే పరిష్కరించే విధంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు.

మరుగుదొడ్ల వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కొత్తవలస

ఏదైనా ప్రయాణంలో ఉన్నప్పుడు వినియోగదారులు పెట్రోల్ బంకుల్లో మరుగుదొడ్లు వినియోగించుకోవాలని, వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు కనగాల శివ కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ మనం ఏదైనా ప్రయాణంలో రోడ్ మీద వెళుతున్నప్పుడు అర్జంట్‌గా మరుగు దొడ్లు అవసరం వస్తే సరైన సదుపాయాలు అందుబాటులో లేనప్పుడు దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లోని మరుగుదొడ్డి సదుపాయాన్ని వినియోగించుకోవచ్చునని చెప్పారు. అటువంటి మరుగుదొడ్ల నిర్వహణకు మనం డబ్బు చెల్లిస్తామన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. దీనికోసం పెట్రోల్ బంక్ వారు తమ వద్దకు వచ్చే ప్రతి కస్టమర్ నుండి ప్రతి లీటర్‌కు రూ.6 పైసలు చొప్పున మరుగుదొడ్ల నిర్వహణకు మరో రూ.4 పైసలు మంచి నీళ్ళ ఏర్పాటుకు వసూల్ చేస్తారన్నారు. భారత పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం అన్ని పెట్రోల్ బంకుల్లో పరిశుభ్రమైన మరుగు దొడ్లు తాగు నీరు అందుబాటులో వుంచడం తప్పని సరి అని ప్రజలందరూ ఈ సౌకర్యాలను ఉచితంగా వినియోగించు కోవచ్చునని వీటి నిర్వహణ సంతృప్తికరంగా లేకపోతే స్వచ్ఛత యాప్ ద్వారా ఉన్నత అధికారులకు పిర్యాదు చెయ్యవచ్చునన్నారు. వినియోగదారులందరూ గమనించాలని కోరారు.



కనగాల శివ

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు అండర్ -14, 17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు, మరో ఇద్దరు బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ డాక్టర్ పొట్లూరు శ్రీరాములు తెలిపారు. వీరు డి.ఎస్.ఎ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల నుండి ఎంపికైనట్లు తెలిపారు. వీరు విజయవాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు జరగబోవు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్య వహిస్తారని, బాస్కెట్ బాల్ క్రీడాకారులు విజయవాడ సిద్ధార్థ స్కూల్‌లో ఈనెల 11 వ తేదీ నుంచి 13వ తేదీవరకు జరగబోవు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 బాస్కెట్ బాల్ పోటీలలో పాల్గొంటారని శ్రీరాములు తెలిపారు. స్విమ్మింగ్ పోటీలకు టి.కిరణ్, జి.మణికంఠ, డి.యస్వంత్, ఎమ్.చరణ్, వై.సాగర్, వి.తేజ, వి.రోహిత్, వి.రాంచరణ్, పి.వంశీలు ఎంపిక కాగా బాస్కెట్ బాల్‌కు వి.సాగర్, పి.యస్వంత్‌లు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు ఉపాధ్యాయులు



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపిడిఒ, తహశీల్దార్

ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఇమంది బాస్కరావు, ఎంపిడిఒ జి. రామారావు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలని తెలిపారు. గ్రామ సచివాలయంలో ఎటువంటి ఫొటోస్ ఉండకూడదన్నారు. గురువారం నుండే కోడ్ అమల్లో ఉందన్నారు. రాజకీయ నాయకులకు దూరంగా ఉండాలన్నారు. పూసపాటిరేగ హైస్కూల్‌లో రెండు పోలింగ్ భూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ లావణ్య, కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో జెడి తనిఖీలు

దత్తిరాజేరు : ఆవు దూడలు జన్మించేందుకు సెక్సడ్ సార్టెడ్ సెమెన్ ద్వారా చేపడుతున్న కృత్రిమ గర్భధారణ విధానాన్ని రైతులకు అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ జెడి వైవి రమణ అన్నారు. మండలంలో శుక్రవారం మరడాం పశుచికిత్స కేంద్రాన్ని ఈయన సందర్శించారు. ఈ సందర్భంగా పశు వైద్య కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. గొర్రెలు మేకలకు పారుడు నివారణ వ్యాక్సిన్ ఎంత శాతం వేశారో ఆరా తీశారు. రానున్న వేసవికాలం దృష్ట్యా రైతులు పశుగ్రాసాల సాగు చేపట్టి, కొరత లేకుండా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ఏడి డాక్టర్ చంద్రశేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు.



ఆవును తనిఖీ చేస్తున్న జెడి రమణ

నేడు మాత్రలు పంపిణీ

వేపాడ : స్థానిక పిహెచ్‌సిలో శనివారం నిర్వహించునున్న డిఇసి, ఆల్బండ్ జోన్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ పట్నాయక్ అన్నారు. అందుకు సంబంధించిన బాక్సులను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి విజయవంతం చేయడానికి గ్రామ వాలంటీర్లు అందరూ పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి సిఐసి సూర్యనారాయణ, పీహెచ్సీ వైద్యాధికారిని ఏ ధరణి, సిహెచ్ ఆంజనేయులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భవనం ప్రారంభం

బొబ్బిలి : బొబ్బిలి దక్షిణ దేవుడి వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ను చీపురుపల్లి వీధిలో ఉన్న హ్యాపీ షాపింగ్ మాల్ మేడపైకి మార్చారు. నూతన భవనంలో బ్యాంకు సేవలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు చేరువలో బ్యాంకు సేవలు అందించాలని కోరారు. నాణ్యమైన సేవలు అందిస్తే బ్యాంక్ లావాదేవీలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, బొబ్బిలి మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరావు, వైసిపి నాయకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే